# “సూర్యోదయం కుట్రకాదు” పుస్తకావిష్కరణ సభ



పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న దుప్పల గోవిందరావు

**శ్రీకాకుళం, 15-5-16 :**

స్థానిక జిల్లా పరిషత్ అసెంబ్లీ హాలులో తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు మరియు తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ కమిటీల సంయుక్త నిర్వహణలో ‘సూర్యోదయం కుట్రకాదు’ పుస్తకావిష్కరణ మరియు తరిమెల నాగిరెడ్డి శతజయంతి సభ జరిగింది. వక్తలను కా॥ తాండ్ర అరుణ వేదికపైకి ఆహ్వానించగా, పార్వతీపురం కుట్రకేసులో 2వ ముద్దాయి అయిన దుప్పల గోవిందరావు ఈ సభకు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ–భూమిసమస్య కేంద్ర అంశంగా శ్రీకాకుళ రైతాంగ సాయుధపోరాటం జరిగిందని అంటూ ‘వియత్నాం, కాంబోడియా మనవి’ అన్న రోజుల్లో తాము కమ్యూనిస్టులయ్యాం అనీ, ఇవాళ కమ్యూనిస్టు అన్నది చాలా సంక్లిష్టంగా మారిందనీ అన్నారు.

సిపిఐ (యం) రాష్ట్ర నాయకులు చౌదరి తేజేశ్వరరావు మాట్లాడుతూ పౌరహక్కుల పరిరక్షణ కోసం కా॥తరిమెల నాగిరెడ్డి వచ్చిన ఆనాటి శ్రీకాకుళం సభ ఉత్తేజకరమైంది అన్నారు. శ్రీకాకుళ రైతాంగ పోరాట విశేషాల్నీ, పార్వతీపురం కుట్రకేసు నేపధ్యాన్ని వివరించారు. ఇప్పటి పరిస్థితుల్లో ఎర్రజెండా పార్టీలన్నీ కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరం వుందన్నారు.

సిపిఐ నాయకులు ముఖలింగం మాట్లాడుతూ కోరన్న మంగన్నలను కాల్చిచంపిన పెత్తందార్లే ప్రభుత్వం దన్నుతో అక్కడి గిరిజన మహిళల్ని బట్టలిప్పి కొట్టడం జరిగిందనీ, భూమిసమస్య కేంద్రంగా గిరిజనోద్యమం సాగిందనీ, నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆ పోరాటాన్ని ఐక్యంగా కొనసాగిస్తేనే ఫలితాలు సాధిస్తామని అన్నారు.

సి.పి.ఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ (చంద్రం) జిల్లా కార్యదర్శి పైల చంద్రమ్మ మాట్లాడుతూ ఈ కుట్రకేసు అనేది – ప్రభుత్వం కుట్రపన్ని కేసు పెట్టిందనీ –వందలమంది ఆ పోరాటంలో నేలకొరిగారనీ–చివరి వరకు పోరాటం కొనసాగించటానికి ముందుకెళుతున్నాం అంటూ మాట్లాడారు.

సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ (బోస్) నాయకులు తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ – తరిమెల నాగిరెడ్డి రివిజనిజానికీ, నయారివిజనిజానికీ వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేశారన్నారు.

సిపిఆర్‌పిఐ(ఎం.ఎల్) నాయకులు, పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయి నంబళ్ళ అప్పలాచారి మాట్లాడుతూ చెరుకూరి సత్యనారాయణ సంపాదకత్వం వహించి పార్వతీపురం కుట్రకేసు చరిత్రని నమోదు చేశారనీ, అన్ని జబ్బులూ పోరాటంలోనే నయం అవుతాయనీ, పదిమందికో పార్టీగా విప్లవం సొంత ప్రయోజనాలకి బలికాకూడదని అన్నారు.

సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్రనాయకులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ చారిత్రక ఘటనగా ఈ పార్వతీపురం కుట్రకేసును తీసుకోవాలనీ, బ్రిటిష్ కాలంనుండి ప్రజల్ని, త్యాగపూరిత ప్రజాఉద్యమాల్నీ అణచివేయడానికి కుట్రకేసులు రివాజుగా వస్తున్నాయనీ, వర్గస్వభావరీత్యా నిర్బంధాన్ని పెంచడానికే కుట్రకేసులు పెడతారనీ, అనారోగ్యాన్ని లెక్కచేయకుండా అనంతపురం నుండి శ్రీకాకుళంవరకు పర్యటించి ఈ పుస్తకాన్ని చెరుకూరి సత్యనారాయణ తీసుకొచ్చారనీ, ప్రజలే చరిత్ర నిర్మాతలని ఇలాంటి పుస్తకాల ద్వారా అర్థమయ్యేలా చెప్పాలని అన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) నాయకులు వర్మ, రచయిత అప్పల్నాయుడు తదితరులు మాట్లాడారు. ప్రజా కళాకారులు జనంపాటలు పాడారు. ప్రజలు, ప్రజా ఉద్యమ కార్యకర్తలు, మేధావులు, ఉపాధ్యాయులు, ఈ సభకు హాజరయ్యారు.

oooooo